sahanamvande.com

epaper.sahanamvande.com

సహనం వందే

హైదరాబాద్ | 18-07-2026 శనివారం | సంపుటి-02 సంచిక : 106 EDITOR: ROHINI



ఇన్‌స్టా సైన్యం... రోడ్డుపై మౌనం

కాక్రోచ్ జనతా పార్టీ దుస్థితి

- సోషల్ మీడియాలో యువత యాక్టివ్
- ఢిల్లీ పోరాటంలో కనిపించని నేటితరం
- ఇన్‌స్టాలో కోట్లు... రోడ్డుపై వందల మందే
- పెరిగిన గూఢచర్యం... తిరగబడని యువతరం

డిజిటల్ స్క్రీన్లపై విప్లవం గర్జిస్తోంది. కానీ క్షేత్ర స్థాయిలో పోరాటం మాత్రం వెనకడుగు వేస్తోంది. కోట్ల మంది సోషల్ మీడియా సైన్యం నిరసన క్షేత్రానికి ఎందుకు రావడం లేదు? భారీ నిఘా నీడ... పోలీసుల భయం యువతను కట్టడి చేస్తోందా? భారతదేశ విద్యా వ్యవస్థ సంక్షోభంలో ఉన్న వేళ పాలకుల మౌనం పెను సవాలుగా నిలుస్తోంది. దేశంలో యువ విప్లవం సాధ్యమేనా అనే ప్రశ్నలు ఇప్పుడు తీవ్రంగా వెల్లువెత్తుతున్నాయి.
- సహనం వందే, న్యూఢిల్లీ

వర్చువల్ ప్రపంచంలో కాక్రోచ్ జనతా పార్టీకి 1.9 కోట్ల మంది సైన్యం కనిపిస్తోంది. ఈ సంఖ్య బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకంటే ఎక్కువ. కానీ ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గరకు వచ్చేసరికి ఆ సంఖ్య కేవలం 300 నుంచి 500 మందికి పడిపోతోంది. డిజిటల్ వేదికలపై సింహాలుగా విరుచుకుపడే భారత యువత... క్షేత్రస్థాయిలో ఎందుకు వెనకడుగు వేస్తోంది? ఈ ప్రశ్న ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

నినాదాలకే పరిమితమా?

డిజిటల్ విప్లవం ఒక భ్రమగా మారుతోంది. సోషల్ మీడియాలో మిలియన్ల కొద్దీ ఫాలోవర్లు ఉండటం వేరు, రోడ్లపైకి వచ్చి పోరాడటం వేరు. కాక్రోచ్ జనతా పార్టీకి లభిస్తున్న భారీ డిజిటల్ మద్దతును చూస్తుంటే యువతలో తీవ్రమైన అసహనం ఉన్నట్లు స్పష్టమవుతోంది. కానీ ఆ అసహనం కేవలం ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, కామెంట్ బాక్సులకే పరిమితమవుతోంది. వాస్తవ ప్రపంచంలో జరగాల్సిన ఉద్యమ గమనం ఎక్కడికక్కడ ఆగిపోతోంది.

నిఘా నీడలో భయం

యువత వెనకడుగు వేయడానికి అతిపెద్ద కారణం ప్రభుత్వ నిఘా. జంతర్ మంతర్ వద్ద నిరసనకారులను పోలీసులు భయ పెడుతున్నారు. డ్రోన్ కెమెరాలు, సీసీటీవీల నీడలో నిరసనకారుల కదలికలను రికార్డ్ చేస్తున్నారు. నిరసనలో పాల్గొనే వారి ఆధార్, పాన్ కార్డు వివరాలను పోలీసులు సేకరిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. ఉద్యమిస్తే తమ కెరీర్, భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందనే భయం యువతను ఇళ్లకు పరిమితం చేస్తోంది.

నిరాశలో వాంగ్చుక్

ఒకవైపు క్షేత్రస్థాయిలో నిరసనల తీవ్రత తగ్గినా సోనం వాంగ్చుక్ మాత్రం తగ్గేదే లేదంటున్నారు. 21 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్రం నుంచి కనీస స్పందన లేదు. ఆయన్ను పరామర్శించడానికి రాజకీయ నేతలు వస్తున్నా ఉద్యమాన్ని మాత్రం ఎవరూ భుజానికి ఎత్తుకోవడం లేదు. ప్రభుత్వం అనుసరిస్తున్న మౌన వ్యూహం ఇప్పుడు నిరసనకారుల్లో మరింత నిరాశను, నైరాశ్యాన్ని నింపుతోంది.

నిరుద్యోగపు చిచ్చు

భారతదేశంలో 40 శాతం మంది పట్టభద్రు లు నిరుద్యోగులుగా మారుతున్నారు. అయినా ఎందుకు పెద్ద ఎత్తున స్పందన లేదు? దీనికి కారణం రాజకీయ నిస్సహాయత. ప్రతిపక్షాలు తమ సొంత రాజకీయ ఎజెండాలతో బిజీగా ఉన్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ వంటి స్వతంత్ర ఉద్యమాలు, రాజకీయ పార్టీలతో చేతులు కలిపేందుకు ఆసక్తి చూపడం లేదు. ఒకరిపై ఒకరికి నమ్మకం లేని ఈ వాతావరణం నిరసనను బలహీనపరుస్తోంది.

మారాల్సిన వ్యూహం

డిజిటల్ పోరాటంలో ఇప్పుడు జరుగుతున్నది కేవలం ఆన్‌లైన్ వ్యతిరేకతను ప్రదర్శించుకోవడం మాత్రమే. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే ఆర్థిక, సామాజిక, నిఘా పరమైన సవాళ్లను అధిగమించకుండా మార్పు రాదు. ఆన్‌లైన్‌లో ఉన్న 1.9 కోట్ల మందిలో కనీసం పది శాతం మంది రోడ్డుపైకి వస్తే పాలకులు దిగిరాక తప్పదు. ఆ ధైర్యం భారత యువత ఎప్పుడు చేస్తుందో చూడాలి.

నిర్మొహమాటంగా చెప్పుకోవాలంటే...

సమాజంలో పెరిగిపోతున్న అవినీతి, నీట్ యూజీ వంటి పేపర్ లీకులతో వేల మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యాయి. 11 మంది విద్యార్థుల ఆత్మహత్యలు మన విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం. అయినా మనం కేవలం స్క్రీన్ల మీద మాత్రమే నిరసన తెలుపుతున్నాం. నిఘా యంత్రాంగాన్ని చూసి భయపడితే వ్యవస్థను మార్చడం ఎప్పటికీ సాధ్యం కాదు. డిజిటల్ ప్రపంచంలో గర్జించే యువత, క్షేత్రస్థాయిలో సింహంలా ఎప్పుడు గర్జిస్తుందో కాలమే నిర్ణయించాలి.



అమెరికా వీసాకు గ్రేస్ పీరియడ్

మారిన రూల్స్... తగ్గిన కాలపరిమితి

- విద్యార్థులపై భారం... నిఘాలో జర్నలిస్టులు
- పీహెచ్‌డీ విద్యార్థులకు 4 ఏళ్లకే అనుమతి
- 3.63 లక్షల మంది మన విద్యార్థులకు నష్టం

అమెరికాలో చదువుకోవాలన్నా లేదా మీడియా ప్రతినిధిగా వెళ్లాలన్నా ఇకపై పాత పద్ధతులు కుదరవు. దశాబ్దాలుగా నమ్మకంతో సాగుతున్న వీసా విధానాలకు అగ్రరాజ్యం తెరదించింది. ఇప్పటి వరకు ఉన్న సౌలభ్యం స్థానంలో కఠినమైన ఆంక్షలు ప్రవేశపెట్టింది. వేల మంది విద్యార్థుల కెరీర్‌ను మార్చేసే ఈ నిర్ణయం ఇప్పుడు అందరినీ కలవరపెడుతోంది. అమెరికా ప్రభుత్వం తీసుకున్న ఈ కఠిన నిర్ణయాల వల్ల కలిగే చిక్కులేంటో ఇప్పుడు చూద్దాం.
- సహనం వందే, హైదరాబాద్



ఇప్పటివరకు అమెరికాలో చదువుకునే విద్యార్థులకు డ్యూరేషన్ ఆఫ్ స్టేటస్ అనే పద్ధతి ఉండేది. అంటే మీరు చదువులో చేరినప్పుడు వీసా తీసుకుంటే చాలు, మీ కోర్సు ఎన్ని సంవత్సరాలు కొనసాగితే అన్ని సంవత్సరాలు ఎలాంటి ఇబ్బంది లేకుండా అక్కడ ఉండొచ్చు. కానీ ఇప్పుడు అమెరికా ప్రభుత్వం ఆ పద్ధతిని పూర్తిగా ఎత్తేసింది. దీనివల్ల ఇకపై విద్యార్థులకు ఫిక్స్‌డ్ పీరియడ్ ఆఫ్ అడ్మిషన్ మాత్రమే వర్తిస్తుంది. అంటే మీకు నిర్ణయించిన గడువు ముగియగానే మీరు అమెరికా వదిలి వెళ్లాల్సిందే.

పీహెచ్‌డీ విద్యార్థులకు చిక్కులు

ముఖ్యంగా పీహెచ్‌డీ చేసే వారికి ఈ రూల్ పెద్ద సమస్యగా మారింది. వీరికి గరిష్టంగా 4ఏళ్ల అనుమతి మాత్రమే ఇస్తారు. ఒకవేళ మీ పరిశోధన 4ఏళ్లు దాటితే, ఆటోమేటిక్‌గా వీసా పొడిగించే పద్ధతి ఇక లేదు. మీరు మళ్లీ అమెరికా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి ఫీజులు చెల్లించి, ప్రత్యేక అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఒకవేళ ఆ అనుమతి రాకపోతే మీ చదువు మధ్యలోనే ఆగిపోయే ప్రమాదం ఉంది.

జర్నలిస్టుల కదలికలపై నిఘా

మీడియా రంగంలో పనిచేసే ఐ వీసా హోల్డర్లపై అమెరికా నిఘా మరింత పెంచింది. సాధారణ జర్నలిస్టులకు గరిష్టంగా 240 రోజులు మాత్రమే ఉండేలా కాలపరిమితిని కుదించారు. అదే చైనా జర్నలిస్టుల విషయానికి వస్తే ఆ గడువును కేవలం 90 రోజులకు పరిమితం చేశారు. ఏటా వందల సంఖ్యలో పెరిగే జర్నలిస్టుల కార్యకలాపాలను పర్యవేక్షించడం కష్టమని అమెరికా భావిస్తోంది. ఈ మార్పుల వల్ల అంతర్జాతీయ స్థాయిలో మీడియా స్వేచ్ఛపై పరోక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది.

భారతీయ విద్యార్థులపై ఒత్తిడి

ప్రస్తుతం అమెరికాలో 3.63 లక్షల మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిపై ఈ మార్పుల ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఉదాహరణకు ఒక విద్యార్థి తన కోర్సు మధ్యలో సబ్జెక్టులు మార్చాలన్నా లేదా స్కూల్ మార్చాలన్నా ఇప్పుడున్న పద్ధతిలో చాలా కష్టంగా మారింది. దీనివల్ల వారు తీసుకునే ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉండాలి. ఏ చిన్న పొరపాటు జరిగినా అది అమెరికాలో ఉండే హక్కును దెబ్బతీసే అవకాశం ఉంది.

గ్రేస్ పీరియడ్ సగానికి తగ్గింపు

చదువు పూర్తయ్యాక ఉద్యోగం వెతుక్కోవడానికి గతంలో ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్‌ను 30 రోజులకు కుదించారు. అంటే కోర్సు అయిపోయాక మీకు ఉన్న సమయం చాలా తక్కువ. ఆ నెల రోజుల్లోపు కొత్త ఉద్యోగం దొరక్కపోతే లేదా వేరే కోర్సులో చేరకపోతే మీరు అమెరికా నుండి వచ్చేయాల్సిందే. ఈ తక్కువ గడువు కాలం విద్యార్థులపై తీవ్ర మానసిక ఒత్తిడిని పెంచుతోంది.

భద్రతే ప్రామాణికం

వీసాల పంపిణీలో అమెరికా భద్రతను ముఖ్యంగా చూస్తోంది. వీసాలను వాడుకుని చాలా మంది పర్మనెంట్‌గా ఉండిపోతున్నారని ప్రభుత్వం ఆరోపిస్తోంది. అందుకే ఈ నిర్ణయాలన్నింటినీ తీసుకుంది. వీసా గడువు పెంచే అధికారం కూడా ఇకపై యూనివర్సిటీలకు ఉండదు, అది పూర్తిగా ఫెడరల్ అధికారుల చేతుల్లో ఉంటుంది. ఇలా ప్రతి అడుగులోనూ అమెరికా కఠినంగా వ్యవహరిస్తోంది. మీరు గనుక అమెరికా వెళ్లాలని ప్లాన్ చేస్తుంటే, ఈ కొత్త రూల్స్‌ను కచ్చితంగా గుర్తు పెట్టుకోవాల్సిందే.

600 మంది భర్తల హత్య

6 నెలల్లో భార్యల మారణహోమం

- పెరిగిన అక్రమ సంబంధాలే కారణం
- విషం కక్కుతున్న సోషల్ మీడియా
- కుప్పకూలిన కుటుంబ వ్యవస్థ



పెళ్లి అంటే నమ్మకం, బంధం, తోడు. కానీ నేడు ఆ బంధమే మృత్యుపాశంగా మారుతోంది. కట్టుకున్న భర్తలు కంటికి రెప్పలా కాపాడుతుంటే, భార్యలు మాత్రం ప్లాన్డ్ గా ప్రాణాలు తీస్తున్నారు. గురుగ్రామ్ కు చెందిన ఏకం న్యాయ్ ఫౌండేషన్ రిపోర్ట్ ప్రకారం, కేవలం 6 నెలల్లోనే 592 మంది భర్తలు మరణించారు. ఇది ఏదో ప్రమాదం కాదు... కళ్ళముందే జరుగుతున్న పక్కా ప్రణాళికాబద్ధమైన దారుణం. అసలు ఇంట్లో భార్య ఉందా? లేక కాలయముందా? - సహనం వందే, హైదరాబాద్

ఏకం న్యాయ్ ఫౌండేషన్ గణాంకాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జులై 14 వరకు 592 మంది భర్తలు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో 401 మందిని భార్యలే హత్య చేశారు. రోజుకు ముగ్గురు భర్తలు చొప్పున బలైపోతున్నారంటే వ్యవస్థ ఎంతటి ప్రమాదకర స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆస్తి కోసం లేదా ప్రియుడితో విలాసాలకు అడ్డు వస్తున్నారనే నెపంతో ప్రాణాలు తీయడం సర్వసాధారణమైపోయింది.

చిత్తూరు జిల్లాలో దారుణం

మొన్న చిత్తూరు జిల్లాలో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. రమేష్ అనే వ్యక్తిని అతని భార్య హాసిని దారుణంగా అంతం చేసింది. తిరుపతి వెళ్తున్నామని భర్తను నమ్మించి బైక్ మీద తీసుకెళ్లింది. ముందే ప్లాన్ చేసుకున్న విధంగా భర్తను ఆపి ప్రియుడు యుగంధర్, అతని గ్యాంగ్ తో కలిసి నరికించింది. భార్యల కుట్ర ఎంతలా ఉందో చెప్పడానికి ఈ ఉదంతం ఒక నిలువుటద్దం. కళ్ళముందే భర్త ప్రాణాలు పోతుంటే ఆ మహిళ చలించలేదు.

అత్యాశకు బలి

నిరపరాధులైన భర్తల చావులకు అక్రమ సంబంధాలే మూల కారణం. సోషల్ మీడియాలో పరిచయాలు, క్షణికపు ఆకర్షణలు కుటుంబ వ్యవస్థను నాశనం చేస్తున్నాయి. తన భర్త, బిడ్డ బాగుండాలని రాత్రనక పగలనక కష్టపడే భర్తకు దక్కేది ఇదేనా? ఆస్తి కోసం లేదా అక్రమ సంబంధం కోసం కన్న బిడ్డ భవిష్యత్తును కూడా గాలికి వదిలేస్తున్నారు. కట్టుకున్న వాడే శత్రువుగా మారి నిద్రలోనే ప్రాణాలు తీస్తున్న పరిస్థితి నెలకొంది.

నిస్సహాయతలో భర్తలు

మరో 191మంది భర్తలు ఆత్మహత్యలు చేసుకున్నారు. భార్య వేధింపులు, అక్రమ సంబంధాల ఒత్తిడిని భరించలేక వారు తనువు చాలించారు. పెళ్లి చేసుకుంటే జీవితం సాఫీగా ఉంటుందనుకున్న భ్రమ లు పటాపంచలవుతున్నాయి. పరువు పోతుందనో పిల్లల భవిష్యత్తు ఏమవుతుందో అని మగాడు మౌనంగా కుమిలిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక్కడ భర్తలకు భద్రత అనేదే ప్రశ్నార్థకంగా మారింది.

వ్యామోహంలో మహిళలు

సోషల్ మీడియా రీల్స్, చాటింగ్ యాప్స్ ద్వారా అపరిచితులతో ఏర్పడుతున్న సంబంధాలు పెళ్లి అనే వ్యవస్థను కుప్పకూల్చేస్తున్నాయి. బాధ్యత కంటే సోషల్ మీడియా, విలాసాలే ముఖ్యం అనుకుంటున్నారు. ఇంట్లో లక్ష్మి అని కొలిచే సంస్కృతి నుంచి ఆ లక్ష్మి వేషంలోనే మృత్యువు దాగుందని భయపడే స్థాయికి సమాజం దిగజారింది. పెళ్లి అంటేనే ఇప్పుడు ఒక రిస్క్‌గా, డెత్ ట్రాప్ లా కనిపిస్తోంది.

అప్రమత్తత అవసరం

భర్తలు ఇప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతకాల్సిందేనా? ప్రస్తుత పరిస్థితుల్లో పెళ్లి చేసుకునేటప్పుడు ప్రతి ఒక్కరూ పది సార్లు ఆలోచించాలి. ఎదుటి వ్యక్తి క్యారెక్టర్, ప్రవర్తన, సోషల్ మీడియా వాడకం గమనించాలి. కళ్ళు మూసుకుని ఎవరినీ నమ్మకూడదు. ఈ 592మంది ప్రాణాలు కేవలం అంకెలు కావు, సమాజపు నైతిక పతనం. కుటుంబ విలువలు లేని వారు పెళ్లికి అనర్హులు అని తెలుసుకోవాలి.